ప్రజల మాట ప్రగతి బాట

# కవిత అలుపెరగని ప్రచారం



ఇటీవల నిజామాబాద్ నగరంలో రోడ్‌షో నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కవిత



- 10 నియోజకవర్గాల్లో విస్తృత పర్యటన
- 70కి పైగా రోడ్‌షోలు, పాదయాత్రలు, సమావేశాలతోముమ్మరంగా ప్రచారం చేసిన ఎమ్మెల్సీ కవిత
- నెల రోజులకు పైగా నిజామాబాద్‌లోనే బస
- నిజామాబాద్ కేంద్రంగా బీఆర్ఎస్ గెలుపునకు వ్యూహం
- ఆకట్టుకున్న ప్రసంగాలు.. భారీగా పోటెత్తిన మహిళలు
- ఎప్పటికప్పుడు పత్రికా సమావేశాలు, జాతీయ మీడియా ఇంటర్వ్యూలు

ఖలీల్‌వాడి, నవంబర్ 28 : ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి బీఆర్ఎస్ పార్టీకి ప్రజల మద్దతు కూడగట్టడానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అలుపెరగని ప్రచారం చేశారు. నెల రోజులకు పైగా నిజామాబాద్‌లోనే బస చేసిన కవిత ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని 10 నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించారు. నిజామాబాద్ అర్బన్, బోధన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, మంథని, పెద్దపల్లి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా ఏర్పాటు చేసిన సభలు, సమావేశాలకు హాజరై ప్రసంగించారు. 70కి పైగా రోడ్‌షోలు, పాదయాత్రలు, స్ట్రీట్ కార్నర్ సమావేశాలు, బహిరంగ సభలు, ఆయా సంఘాలు నిర్వహించిన సమావేశాల్లో పాల్గొని హోరెత్తించారు. కులసంఘాల సమ్మేళనాలు, యువ, మహిళ, కార్మికుల సమ్మేళనాల్లో పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులకు గాను కారు గుర్తుకు ఎందుకు ఓటేయాలో ప్రజలకు అర్థమయ్యే తీరులో చక్కగా వివరించారు. సీఎం కేసీఆర్ సంకల్పించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కాకుండా రాజకీయ పరిస్థితులపై ప్రజలకు చైతన్యం కలిగించేలా సభలు సమావేశాల్లో మాట్లాడారు.

**కాంగ్రెస్, బీజేపీల వైఫల్యాలను సమర్థవంతంగా ఎండగట్టిన కవిత**

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్, బీజేపీ పార్టీల వైఫల్యాలను సమర్థవంతంగా ఎండగట్టారు. తమ పార్టీపై ప్రతిపక్ష పార్టీలు చేసే విమర్శలు, ఆరోపణలు దీటుగా సమాధానం ఇచ్చారు. పదునైన మాటలతో ప్రతిపక్షాలను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా రాష్ట్రాన్ని 55 ఏండ్ల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు చేసింది శూన్యమని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. ఉదాహరణలతో సహా కాంగ్రెస్ పాలనను పదేండ్ల బీఆర్ఎస్ పాలనతో పోల్చి చెప్పడం ప్రజలను ఆకర్షించింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్, నిత్యావసర వస్తువుల ధరలను పెంచడం వంటి అంశాల పై ప్రజాక్షేత్రంలో నిలదీశారు. ఆ రెండు పార్టీల వైఫల్యాలను ఎండగడుతూనే బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను, పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో కలిగిన ప్రయోజనాలు అభివృద్ధిపై తనదైన శైలిలో ఆసక్తికరం గా వివరించడం విశేషం. కవిత ప్రసంగాలు అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకున్నాయి. పెన్షన్ల నుంచి ఉద్యోగ నియామకాలు, అభివృద్ధి ఇలా అన్ని అంశాలపై సమగ్ర అవగాహనతో ప్రసంగాలు చేశారు.

**ఎమ్మెల్సీ కవిత సభలకు భారీగా పోటెత్తిన మహిళలు**

ఎమ్మెల్సీ పాల్గొన్న ప్రతి సభలు, రోడ్‌షోలు, సమావేశాలకు మహిళలు, యువత పెద్ద ఎత్తున తరలి రావడం గమనార్హం. మహిళలు, యువత కవిత పట్ల ప్రత్యేక అభిమానాన్ని చాటుకున్నారు. అనేక సార్లు కవిత రోడ్‌షోలు, సభలు ముగిసిన వెంటనే వేదిక దిగి నేరుగా మహిళల మధ్యకు వెళ్లి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. వారు కూడా కవితను ఆప్యాయం గా పలకరించారు. అదే విధంగా యువత కూడా కవిత ప్రచార కార్యక్రమాల్లో భారీ సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. ఏ గ్రామానికి వెళ్లినా కవితకు ఘనస్వాగతం లభించింది.

**ఎమ్మెల్సీ కవిత సమక్షంలో చేరికలు**

ప్రచార కార్యక్రమాల సందర్భంగా ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కవిత సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వ్యూహాత్మకంగా వ్యవహరించిన కవిత కోరుట్ల టౌన్ బీజేపీ అధ్యక్షుడు, ఇద్దరు కౌన్సిలర్లతో పాటు దాదాపు 200 మంది కార్యకర్తలను పార్టీలో చేర్చుకుని దాదాపు ఆ నియోజకవర్గంలో బీజేపీ ఖాళీ అయ్యే పరిస్థితికి తీసుకొచ్చారు. ఉమ్మడి జిల్లాలోనూ పెద్దసంఖ్యలో యువత కవిత సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు.

---

# ఖండాంతరాలకు తెలంగాణ ఖ్యాతి

నమస్తే ఇంటర్వ్యూ

- కేసీఆర్ పరిపాలనతోనే ప్రత్యేక గుర్తింపు
- రాష్ట్రంలో మళ్లీ కేసీఆరే అధికారంలోకి వస్తారు
- స్వపరిపాలనతో యువతకు బంగారు భవిష్యత్తు
- ఐటీ విస్తరణలో నిజామాబాద్‌పై నాది ప్రత్యేక శ్రద్ధ
- 52 దేశాల ఎన్ఆర్ఐ ప్రతినిధులతో ఎన్నికల ప్రచారం
- 'నమస్తే తెలంగాణ'తో బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల




నిజామాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర ఖ్యాతి ఖండాంతరాల్లో మారుమోగడానికి ముమ్మాటికీ సీఎం కేసీఆర్ ఆదర్శవంతమైన పరిపాలనే కారణమని బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్ఆర్ఐ కో–ఆర్డినేటర్ మహేశ్ బిగాల చెప్పారు. స్వరాష్ట్రం సాకారం అయ్యాక విప్లవాత్మకమైన నిర్ణయాలతో రాష్ట్రం ముందుకు దూసుకుపోతున్నదని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, సుపరిపాలన సాధనలో ప్రవాస తెలంగాణ వాసుల పాత్ర అమూల్యమైనదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీకి వెన్నుదన్నుగా అనేక దేశాల్లో ప్రవాసులు అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు విదేశాల్లో ఉపాధి అవకాశాల నిమిత్తం పరుగులు పెట్టుకుంటూ వచ్చిన ఎన్ఆర్ఐలకు ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న అభివృద్ధి, తెలంగాణలో ఐటీ విస్తరణ వంటి చర్యల మూలంగా స్థానికంగానే ఉద్యోగావకాశాలు దొరకడం సంతోషమనిపిస్తున్నదని అన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సహకారంతో నిజామాబాద్ వంటి ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీ ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఐటీలో మేటిగా తెలంగాణ ఆవిర్భవించడం గొప్ప విషయమని తెలిపారు. శాంతి, భద్రతల పరిరక్షణతో పాటు పారిశ్రామికవేత్తల అవసరాలను తీర్చడంలో అనుకూలమైన ప్రభుత్వం ఉండడం ఇందుకు కారణమని ఆయన వివరించారు. బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్ఆర్ఐ కో–ఆర్డినేటర్‌గా నిజామాబాద్‌లో ఐటీ విస్తరణకు తన పాత్ర తప్పక ఉంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో'నమస్తే తెలంగాణ'తో ముచ్చటించిన ఆయన పలు విషయాలను వెల్లడించారు.

**52 దేశాల ఎన్ఆర్ఐ ప్రతినిధులతో ప్రచారం...**

ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ గెలుపే ధ్యేయంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. గ్లోబల్ బీఆర్ఎస్ కో–ఆర్డినేటర్‌గా ఇప్పటికే పలు ప్రాంతాల్లో టూర్లు నిర్వహించాం. బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ శాఖ 52 దేశాల్లో పని చేస్తున్నది. దీంట్లో భాగంగా కేటీఆర్ ద్వారా జూమ్ మీటింగ్ కూడా ఇప్పటికే నిర్వహించాం. 500 మందితో కేటీఆర్ నేరుగా మాట్లాడి దశ,దిశను సూచించారు. వివిధ దేశాల నుంచి 100 మంది తెలంగాణకు వచ్చి ప్రచారం చేస్తున్నారు. నిజామాబాద్ అర్బన్‌కు 30 మంది ఎన్ఆర్ఐలు వచ్చి ప్రచారం చేశారు. సోషల్ మీడియాలోనూ విస్తృతంగా బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులను తీసుకెళ్లడంతో పాటు ఈ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు వేయాలన్న సందేశాన్ని విస్తృతంగా జనాల్లోకి తీసుకెళ్తున్నాం. 100 నియోజకవర్గాల్లో ప్రచారం కూడా నిర్వహించాం. మేము ఉంటున్న దేశాల్లో ఏం జరుగుతుంది? బయటి దేశాలకు ఇక్కడి పరిస్థితులకు తేడా లేకుండా మౌలిక సదుపాయాలను తెలంగాణ సర్కారు కల్పించిన విషయాలను విశదీకరించి చెబుతున్నాం. అలాంటి ప్రోగ్రెసివ్ గవర్నమెంట్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఇదే విషయాన్ని ఓటర్లకు వివరిస్తున్నాం. ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీ, ఐటీ అనుబంధ సంస్థ ల్లో 50వేల ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. పరోక్షంగా మరిన్ని ఉద్యోగావకాశాలు మూడు రెట్లు పెరుగుతాయి. తద్వారా ఉపాధి లోటు కనిపించదు.

**తెలంగాణలో సమ్మిళిత వృద్ధి...**

పదేండ్ల తెలంగాణలో సమ్మిళిత వృద్ధి సాధ్యమైంది. పారదర్శకమైన పరిపాలన, కచ్చితత్వమైన గవర్నెన్స్ మూలంగానే ఇదంతా జరిగింది. కేసీఆర్ ముందుచూపుతో వ్యవసాయాన్ని స్థిరీకరించారు. పరిశ్రమలకు విద్యుత్, సాగునీటి కొరత లేకుండా చేశారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు మంచి వాతావరణాన్ని కల్పించారు. గ్లోబల్ సిటీ అన్నట్లుగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడం ద్వారా పరిశ్రమలు తరలివచ్చి పెట్టుబడులు పెడుతున్నాయి. పారిశ్రామిక ప్రగతితో పా టు వ్యవసాయాభివృద్ధి మూలంగా తెలంగాణలో తలసరి ఆదాయం భారీగా పెరిగింది. తెలంగాణ వచ్చిన తర్వాత తలసరి ఆదాయం, జీఎస్‌డీపీ మూడు రెట్లు గ్రోత్ సాధించింది. 2014లో రూ.4.51లక్షల కోట్లు ఉన్న జీఎస్‌డీపీ ఇప్పుడేకంగా రూ. 13.13లక్షల కోట్లకు చేరింది. 2014లో తలసరి ఆదాయం రూ.1.24లక్షలుంటే ప్రస్తుతం రూ. 3.17లక్షలకు చేరింది. తెలంగాణలో స్థాపిత విద్యుత్ సామర్థ్యం 2014లో 7778 మెగావాట్లు ఉంటే 2021నాటికి 26వేల మెగావాట్లకు పెరిగింది. వ్యవసాయానికి సాగునీరు తెలంగాణ రాక ముందు కేవలం 62లక్షల ఎకరాలకు మాత్రమే అందుతుండేది. ఇప్పుడు 1.35కోట్ల ఎకరాలకు సాగునీటి వసతి కల్పించబడింది. ఐటీ రంగంలో 2014లో ఉద్యోగాలు 3లక్షల 23వేల 396 ఉంటే 2023లో 9లక్షల 5వేల 715 కు చేరింది. ఐటీ ఎగుమతులు నాలుగు రెట్లు పెరిగాయి. 2014లో రూ.57వేల కోట్లు ఉండగా 2023లో 2.41లక్షల కోట్లకు చేరిందంటే తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని అంచనా వేసుకోవచ్చు.

### త్వరలోనే గ్లోబల్ లాజిక్ సంస్థ రాక...

"ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సహకారంతో చేసిన కృషి ఫలితంగా నిజామాబాద్‌కు గ్లోబల్ లాజిక్ సంస్థను తీసుకు వస్తున్నాం. గ్లోబల్ లాజిక్ సంస్థ త్వరలోనే నిజామాబాద్ ఐటీ హబ్‌లో స్థాపించబోతున్నాం. ఎన్నికల తర్వాత పనులు మొదలు పెడతారు. వచ్చే నెలలో కార్యకలాపాలు షురూ అయ్యే అవకాశాలున్నాయి. గ్లోబల్ లాజిక్ సంస్థలో ప్రస్తు తం 30వేల మంది పని చేస్తున్నారు. ఇది అంతర్జాతీయంగా పేరొందిన హిటాచీ కంపెనీకి అనుబంధ ఐటీ సంస్థ. నిజామాబాద్ లాంటి పట్టణానికి గ్లోబల్ లాజిక్ సంస్థ రావడం ఈ ప్రాంత యువత అదృష్టం. ఇండియాలో అనేక అవకాశాలు ఉన్నప్పటికీ నిజామాబాద్‌కు తీసుకువస్తున్నాం. 250 మందికి ప్రాథమికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతాయి. హైదరాబాద్‌లో 3వేల మందికి పైగా యువత గ్లోబల్ లాజిక్‌లో పని చేస్తున్నారు. ఇలా ఐటీలో యువతకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ఎమ్మెల్సీ కవితతో కలిసి వీలైనన్ని కొత్త ప్రాజెక్టులు నిజామాబాద్‌కే తరలించేందుకు ప్రయత్నిస్తున్నాం. నిజామాబాద్‌లో ప్రస్తుతం ఉన్న ఐటీ టవర్ వెనుక భాగంలోనే మరో ఐటీ టవర్‌ను నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. ఈ ప్రక్రియ కోసం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యేక చొరవతో పాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల సహకారంతో కృషి చేస్తున్నాం. సెకండ్ టవర్ నిర్మాణం కోసం కేటీఆర్‌తోనూ మాట్లాడాం. తప్పకుండా సహకారం అందిస్తామన్నారు. నేను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో అనేక దేశాలు పర్యటించాను. కేటీఆర్ పనితీరు చూశాక... తెలంగాణకు రావడానికి అనేక కంపెనీలు ఇష్టపడుతున్నాయి. ఇండియాలో ఏ పెట్టుబడికి వచ్చినా తెలంగాణకే పట్టుకొచ్చేందుకు కేటీఆర్ కృషి చేస్తున్నారు. నా వరకు తెలంగాణకు వచ్చే ఐటీ కంపెనీలను నిజామాబాద్‌కు తేవాలి అన్నదే ఆలోచన."